# నేపథ్యసంగీతం

అంగర సూర్యారావు

కథానిక

ఆ ఆఫీసులోని గుమస్తాలు పన్నెండుగురూ సర్కస్ గుఱ్ఱాలలా వరసగా నడుస్తున్నారు. వాళ్ళ అడుగులకు లయగా శ్రావ్యమైన సంగీతం వినిపిస్తోంది. ఆ సంగీతం-రోడ్డుకి ఇరువైపులవున్న హోటళ్ళలోంచి కావచ్చు-వస్తోంది. ఆ పన్నెండుగురు ఒకేసారి మధ్యాహ్నం రెండు గంటలవేళ బయలుదేరడానికి గల కారణం అపూర్వం! వాళ్ళలోని ఒక సోదర గుమస్తాకు ప్రమోషన్ రావడమే కారణం! ఆ అందరి మధ్యా చిరునవ్వుతో నడుస్తూవున్నాడు చూశారూ? అతనే పేరయ్య-అతనికే యిప్పుడు ప్రమోషన్ వచ్చింది. సరే! ప్రమోషన్ వస్తే ఆఫీసు వదిలిపెట్టి రోడ్డుమీద తిరగడ మెందుకంటారేమో! పూర్వకాలంలో శుభం కలిగిన వెంటనే దేవాలయానికి వెళ్ళి మొక్కుబడి చెల్లించేవారట. ఈనాడు శుభవార్త తెలిసిన వెంటనే కాఫీహోటలుకు వెళ్ళి తన సంతోషాన్ని తన చుట్టూవున్న మానవగ్రహాలకు పంచి పెట్టితీరాలి. దేవతలైతే తెలియకుండా శపిస్తారు కాని యీ మానవులు తెలిసేలాగే శపిస్తారు అందుకే దేవుడి మొక్కుబడినుంచి తప్పించుకున్న మానవుడు వుంటాడు కాని మానవుడి మొక్కుబడినుంచి తప్పించుకోగలిగిన మానవుడు వుండడు.

మానవుడు పరమపదించినప్పుడు కాని పైమెట్టుమీదికి వెళ్ళినప్పుడు కాని అతని జీవిత చరిత్రను సంస్మరించుకోవడం ఈ 20వ శతాబ్దపు నాగరికతా లక్షణాలలో ముఖ్యమైనది. పేరయ్య సంగ్రహ జీవితచరిత్ర తెలుసుకోవడానికి ఆ ఆఫీసులోని గుమస్తాలు కొందరు ప్రయత్నించారు కాని లాభం లేకపోయింది. పేరయ్య జీవితచరిత్ర పెద్ద ప్రబంధంవంటిది. ప్రతి పుటా జటిలపద భూయిష్ఠం, జీవితమంతా ఆఫీసు ఫైళ్ళతో కుస్తీ పట్టులుపట్టి ఓపిక కోల్పోయిన గుమస్తాలు అతని జీవిత చరిత్రను అర్థం చేసుకోలేక వదిలేశారు. నిత్యం 11 గంటలకువచ్చి ఖులాసాగా ఆఫీసు కాగితాలు రాస్తూ సాయంత్రం ఐదుగంటలకు యింటికి వెళ్ళిపోయే తెరమీది పేరయ్యనే వాళ్లు ఎరుగుదురు. తెర వెనుక పేరయ్యను వాళ్లు ఎరగరు. తెరమీది పేరయ్యకు ఏ సమస్యలూ లేవు-విచారం లేదు-కోపం లేదు-ద్వేషంలేదు. సర్కస్ గుఱ్ఱంలా ఆఫీసరు చెప్పిన పనులన్నీ చేసేసి అతన్ని మెప్పించడమే యితని కర్తవ్యం.

గత శతాబ్దంలోని కోటూ యీశతాబ్దంలోని పంచెకట్టుకోని నాగరికత అంటే యేమిటో తెలియనట్లు కనిపించే పేరయ్యకు-నూటికి నూరుపాళ్లు నాగరికులైన ఒక కూతురూ ఒక కొడుకూ వున్నారు. యమునకు ఇరవై రెండు ఏళ్ళ వయస్సు దాటిపోయినా పేరయ్య ఆమెకు పెళ్ళి చెయ్యలేకపోయాడు, పైగా ఆమెకు ఉన్నతవిద్య నేర్పిస్తున్నాడు. యమునను చూసిన యిరుగుపొరుగు ఆడవాళ్ళంతా ఆమెలో సంసారి లక్షణాలు లేవని యేకగ్రీవంగా అంగీకరించారు. లేకపోతే ఆడదానికి పైచదువు లేమిటి? యిటువంటి విమర్శలన్నీ నేపథ్యంలో జరుగుతున్నై. కనక పేరయ్యకు వీటిని తెలుసుకోనే అవకాశంసరిగా దొరకలేదు.

ఒకనాడు పేరయ్య దగ్గరబంధువు ఒకాయన యిలా అన్నాడు.

"చూడండి పేరయ్యగారూ! మీది గొప్ప వంశం. మీ వంశంలోని ఒక ఆడపిల్లను యిలా పాడుచెయ్యడం మంచిపని కాదు."

"నేనేం పాడుచెయ్యడం లేదే!" అన్నాడు పేరయ్య ఆశ్చర్యంగా.

"పెళ్ళి చెయ్యకుండా వయసొచ్చిన ఆడపిల్లని మొగాళ్ల మధ్యకు పంపి చదివించడం పాడుచెయ్యడంకాక మరేమిటి?" అన్నాడా ఆప్తబంధువు తర్కిస్తూ.

"ఎక్కడైనా మంచి సంబంధం చూపించి పుణ్యం కట్టుకుంటే చాలా సంతోషిస్తాను. దాని పెళ్ళికోసం చాలా ప్రయత్నాలు చేశాను. అందరూ వేలసంఖ్యలో కట్నాలు కావాలనే వాళ్ళే! నిత్యజీవితం దొర్లించడమే బరువుగా వుంటే కట్నానికి డబ్బు ఎక్కడినుంచి తెస్తాను?"

పేరయ్య జవాబు ఆ బంధువుకి అసంతృప్తి కలిగించింది. అతని ఆర్థిక పరిస్థితులతో బంధువులకు, లోకానికి అవసరంలేదు. అతను కూతురికి పెళ్ళిచేసి తీరవలిసిందే, ఆ బంధువు మరెప్పుడూ పేరయ్యకు కనిపించలేదు.

పేరయ్య ఉదయం లేవగానే సంచి తీసుకొని బజారుకు వెడతాడు. యింట్లోకి కావలసిన సామాన్లు స్వయంగా తీసుకువస్తాడు. ఆఫీసు టైం అయ్యేవరకూ ఏ పేపరో చదువుతూ కూర్చుంటాడు. అతను యింట్లో కూర్చుని ఏ పని చేస్తూవున్నా నేపథ్యంలోంచి సంగీతం వినిపిస్తూ వుంటుంది. పేరయ్య భార్య వంకాయలు పుచ్చిపోయినవని కానీ - బియ్యంనిండా నూకలూ రాళ్లూ అనికానీ - కేకలువేసే సమయంలో- నేపథ్యంలోంచి "జగమే మాయ"వంటి వేదాంత గీతం వినిపిస్తూ వుంటుంది. పేరయ్య వుంటున్న భాగానికి అవతలవైపు భాగానికి మధ్యవున్న గోడకు మందం తక్కువైవుండాలి. లేకపోతే ఆ భాగంలో వుండేవాళ్లు వేసుకొనే గ్రామఫోను పాటలు అంత స్వచ్ఛంగా వినిపించడానికి అవకాశం లేదు. అవతలి భాగంలోంచి వినిపించే పాట అతని దైనిక కార్యక్రమానికిలయగా-శ్రావ్యంగా-హాయిగా వుంటోంది. అవతల భాగంలో ఎవరున్నారో పేరయ్యకు తెలీదు. తెలుసుకోవాలన్న జిజ్ఞాసా అతనికిలేదు. ఎప్పుడూ ప్రణయగీతాలు, వేదాంతగీతాలు వినిపిస్తూ వుంటాయి గనక ఆ భాగంలో ఏ ఉద్యోగంలేని నిరుద్యోగికాని-పెళ్ళికాని ఆడపిల్లకాని ఉండి వుండాలని పేరయ్య ఊహించాడు.

ఒకనాడు ఉదయం పేరయ్య కాఫీ తాగి పడకకుర్చీలో పడుకొని తన జీవితాన్ని గురించి తర్కించుకుంటున్నాడు. సూర్యకిరణాలు గడప వరకూ వచ్చి ఆగిపోయినై. వికసించిన చేమంతి పువ్వులు పచ్చగా బంగారంలా మెరుస్తున్నయి. నేపథ్యంలోంచి విషాదగీతం వినిపిస్తోంది. ఆ సమయంలో రఘు గదిలోకి వచ్చాడు. వెనక్కి దువ్వినజుత్తు, గుండ్రని ముఖం, బుష్‌కోటు, ఫుల్‌పాంటు, బూటు స్టంటుచిత్రంలో హీరోలా వున్నాడు. అతని ముఖం కోపంతో జేవురించి వుంది. పేరయ్య 'ఏమిటి?' అన్నట్టు ప్రశ్నార్థకంగా రఘుముఖంలోకి చూశాడు.

"నాన్నగారూ! మీరు అక్కను కాలేజీ మానిపించకపోతే నేను చదువు మానేస్తాను" అన్నాడు రఘు కోపంగా.

"ఏం? ఏంజరిగింది?" అన్నాడు ప్రశాంతంగా పేరయ్య.

"నిన్న అక్క గోపాలంగాడి లాడ్జికి వెళ్లింది. వాడువట్టి పోకిరీవెధవ! కాలేజీ గోడలనిండా అక్కపేర్లే! నేను బయట తలెత్తుకు తిరగలేకపోతున్నాను."

ఒకక్షణం ఆగి పేరయ్య "యమునా!" పిలిచాడు.

యమునవచ్చింది సన్నగా-తెల్లగా-పొడువుగా వుంది. ముఖంలో తెలివీ ఆనందం కనిపిస్తున్నాయి.

"ఏం నాన్నా?" అంది శ్రావ్యంగా.

"నిన్న ఎవరిలాడ్జికో వెళ్ళావట ఎందుకూ?"

"కెమిస్ట్రీ నోట్సుకోసం గోపాలం లాడ్జికి వెళ్ళాను."

"గోపాలం ఒక్కడి లాడ్జికేకాదు. యీమధ్య నీ ఇష్టంవచ్చినట్టు తిరుగుతున్నావ్. గోడలనిండా నీ పేర్లే!" అన్నాడు రఘు.

"నీకేదైనా నోట్సుకావలిసివుంటే నీ స్నేహితుల లాడ్జికి వెళ్ళవ్? అలాగే నేనూ వెళ్ళాను. అందులో తప్పేముంది? యిక గోడలమీద నా పేర్లున్నాయంటావా? అది చదువుకుంటున్న ఆడపిల్లలకు నీలాంటి ఫూల్సు యిచ్చే పబ్లిసిటీ. దానివల్ల మాకు కలిగే నష్టం ఏంలేదు." అంది సీరియస్‌గా.

"అయితే నీపేరు నేనే గోడలమీద రాస్తున్నానంటావా?"

"మొన్న నువ్వు విమల పేరు గోడమీద రాయలేదూ! అలాగే నీలాంటి స్టుపిడ్ మరొకడు నా పేరు గోడమీద రాసివుంటాడు."

"నువ్వు చదువుతున్నంత కాలం నేను తలెత్తుకు తిరగలేను. నేను రేపటినుంచి చదువు మానేస్తాను."

"శుభం! నీలాంటి పూలుస్సు చదువు మానేస్తే కాలేజీ అయినా బాగుపడుతుంది."

యమున అక్కడినుంచి వెళ్ళిపోయింది. పేరయ్య యింతసేపు వాళ్ళ సంభాషణ శ్రద్ధగా విన్నాడు. నాగరికులం అనుకునేవాళ్ళమధ్యకూడా యీ సంఘర్షణ ఏమిటిరా భగవంతుడా అనుకున్నాడు.

"ఏంనాన్నా! అక్కను కాలేజీ మానిపిస్తారా లేదా?" అన్నాడు సీరియస్‌గా రఘు.

"దానికి పెళ్ళిచెయ్యకుండా-చదువూ చెప్పించకుండా యింట్లో వుంచుకోవడం నాకు యిష్టం లేదురా! చదువుకుంటున్న ఆడవాళ్ళకంటె ఏ వ్యాపకంలేకుండా ఖాళీగా కూర్చున్నవాళ్ళకే చెడిపోయే అవకాశం ఎక్కువ వుంటుందని నా నమ్మకం!" అని పేరయ్య కొడుకుకి సంజాయిషీ చెప్పుకున్నాడు.

రఘుకు తండ్రి సమాధానం నచ్చలేదు. స్వీయ ప్రతిష్ట రక్షణార్థం ఒకనాటి రాత్రి కాలేజీని-యింటిని-స్నేహితుల్ని-సర్వం విడిచిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఈ ఘటనకు పేరయ్య ఏమీ చలించలేదు.

ఒకనాటి ఉదయం పేరయ్య తీరికగా కూర్చున్న సమయంలో అతనిభార్య వచ్చి నిలబడింది. "ఏం?" అన్నట్లు ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాడు పేరయ్య.

"మన యమునకు ఈమధ్య ఏవో ఉత్తరాలు వస్తున్నాయి. చూశారూ?" అంది.

"దాని ఉత్తరాలు నేనుచూడ్డం ఎందుకు?" అన్నాడు ప్రశాంతంగా

"అయ్యో! అలా అంటారేమిటి? ఆడపిల్లకు ఉత్తరాలు ఏమిటండీ!" అంది తన ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ!

"చదువుకుంటున్నవాళ్ళు ఒకరికొకరు ఉత్తరాలు రాసుకుంటూ వుంటారు. అందులో ఆశ్చర్యం ఏముంది?- అదికాకపోయినా - ఇరవై దాటినా దాని మంచిచెడ్డలు దానికి తెలియవా?" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆమె అసంతృప్తితో అక్కడినుంచి వెళ్ళిపోయింది.

మరొకరోజు ఆమె పేరయ్యదగ్గరకువచ్చి "చూడండి! మన యమున శేఖరంతో కలిసి తిరుగుతుందని వూరంతా గోలగావుంది" అంది నెమ్మదిగా.

"మనవెనుక మనగురించి లోకులు వాళ్ళకు తోచినట్లు అనుకుంటారు. అవన్నీ పట్టించుకుంటే మనం యీ లోకంలో క్షణం బ్రతకలేం. మనయింటి వెనకనుంచి వచ్చే పాటలు వినడానికి ఎలా అలవాటుపడ్డామో అలాగే లోకులమాటలు వినడానికికూడా అలవాటు పడాలి!" అన్నాడు నిర్లిప్తంగా.

ఆ యిల్లాలు నిస్పృహతో వెళ్లిపోయింది.

మరికొంతకాలం గడిచేసరికి అనుకున్నంతపనీ జరిగింది. యమున ఎవరితోనో లేచివెళ్ళిపోయింది తన అంచనా తప్పినందుకు లోకం హర్షించింది. తలకు మించిన ఆశయాలు సృష్టించుకుని పేరయ్య ఉభయభ్రష్టత్వం పొందేడని లోకులు చెప్పుకొన్నారు. కాని పేరయ్యమాత్రం తను తప్పుడు దారిలో నడిచానని అనుకోవడం లేదు. నౌకాదళంలో చేరిన రఘునుంచి, శేఖరాన్ని రిజిష్టర్డు మేరేజి చేసుకుని హాయిగా పట్నంలో కాలం గడుపుతున్న యమున నుంచి అతనికి ఉత్తరాలు వస్తూవున్నాయి. తన జీవిత కాలంలో తనబిడ్డల్ని ప్రయోజకులను చేసిననే తృప్తి అతనికి కలిగింది.

జీవితంలో యిటువంటి అపూర్వ ఘట్టాలను దాటిన పేరయ్యకి యీనాడు పై గుమాస్తాగా ప్రమోషను వచ్చింది. పన్నెండుగురు గుమాస్తాల ముందు టిఫిన్ ప్లేట్లు, కాఫీ గ్లాసులు చప్పుడు చేస్తునై. శ్రావ్యమైన సంగీతం వినిపిస్తోంది.

